క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


వెలుగు ఏపీఎం హుస్సేన్ ఉస్మాన్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె మండల డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎంగా హుస్సేన్‌ఉస్మాన్ హజరత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అడ్డాకుల శ్రీనివాసులు బుక్‌కీపర్లతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో కర్నూలు డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో డీపీఎంగా విధులు నిర్వహిస్తున్న హజరత్ ఇక్కడికి వచ్చారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంలో మండలంలో డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: మండలంలోని ప్రైవేట్ పాఠశాలలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రభుత్వ గుర్తింపు లేకున్నా, నిబంధనలు పాటించకున్నా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించకూడదన్నారు. రెన్యూవల్ పొందాలని, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూస్ విక్రయాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలోని 6 సచివాలయాల పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట


విగ్రహాలను ప్రతిష్టిస్తున్న నిర్వాహకులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వెంకటాపురం చెరువు పెద్ద వంక వద్ద వెలసిన గంగామాత ఆలయంలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో పోతురాజు, అమ్మవారి వాహనం అయిన మొసలి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చంద్రయ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, మహామంగళహారతులు, తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం


ఎస్సీ కాలనీ వద్ద వాలిన విద్యుత్ స్తంభం

సంజామల: ముదిగేడు–సంజామల ప్రధాన రోడ్డులోని ఎస్సీ కాలనీ వద్ద విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇదే రాస్తాలో ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఇంటర్ కళాశాల విద్యార్థులు వెళుతుంటారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యార్థినికి సన్మానం


రమ్యను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న రమ్యను యూటీఎఫ్ నాయకులు శుక్రవారం సన్మానించారు. మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో రమ్య 462 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకుడు అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ.. ద్వితీయ సంవత్సరంలో కూడా మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సరైన ప్రణాళికతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంను సన్మానించారు. యూటీఎఫ్ నాయకులు రమేశ్ నాయుడు, అమీర్ బాషా, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన వాహనం

డోన్ టౌన్: డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో బొలెరో వాహనం అదుపు తప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన ఘటన డోన్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇతర వాహనాలు లేకపోవడం, ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి బొలెరో కిందపడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

బదిలీల గుబులు

- ఐదేళ్లు పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీ
- సొంత మండలం కాకుండా ఇతర మండలాల్లో పోస్టింగ్
- సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన


ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కొలిమిగుండ్ల: గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులకు కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 30లోగా బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా సొంత మండలాల పరిధిలో కాకుండా ఇతర మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు ఆందోళనకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలు చోట్ల ఎంపీడీఓలను కలిసి వినతి పత్రాలు అందించారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 82 గ్రామ సచివాలయాలు ఉండగా 708 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 50 నుంచి 60 శాతం మంది సొంత మండలాల్లోనే పని చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంత పంచాయతీలో విధులు నిర్వహించరాదని మాత్రమే నిబంధన విధించింది. సొంత మండలాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇప్పటి వరకు సేవలు అందిస్తూ వచ్చారు.

దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు

సొంత మండలాలు కాకుండా ఇతర మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని స్పష్టంగా సూచించడంతో ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈనెల 22వ తేదీ నుంచే బదిలీలకు అర్హత ఉన్న వారంతా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఆన్‌లైన్ పద్ధతిలోనే బదిలీల ప్రక్రియ జరుగనుంది. చుట్టు పక్కల మండలాల్లో పోస్టుల ఖాళీగా లేకపోతే సుదూరంగా ఉన్న మండలాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. చాలీచాలని వేతనాలతో అక్కడ పని చేయాలంటే ఆర్థికపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఉద్యోగులు సమస్యలు ఎదుర్కోవాల్సి రావడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. పక్క మండలాలు, నియోజకవర్గ పరిధిలో కాకుండా దూరంగా పోస్టింగ్ పడితే కుటుంబ సభ్యులకు దూరంగా ఉండడం వల్ల మానసికంగా తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని దిగులు చెందుతున్నారు. తమను మండలాల పరిధిలోనే బదిలీలు జరిపేలే ప్రభుత్వం జీఓ మార్పు చేయాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


తుమ్మలపెంట గ్రామ సచివాలయం

నియోజకవర్గంలో సచివాలయాలు, ఉద్యోగుల వివరాలు

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు
కొలిమిగుండ్ల	16	126
సంజామల	11	86
కోవెలకుంట్ల	12	120
అవుకు	18	154
బనగానపల్లె	25	222

ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది

ఉద్యోగం సాధించినప్పటి నుంచి కొలిమిగుండ్ల ఒకటో సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ప్రస్తుతం బదిలీల్లో సొంత మండలంలో కాకుండా ఇతర మండలాల్లో పని చేయాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. చుట్టు పక్కల పోస్టులు ఖాళీగా లేకపోతే సుదూరంగా వెళ్లాల్సి వస్తుంది. మాకు వచ్చే వేతనాలతో ఇతర ప్రాంతాలకు పోతే ఖర్చులకే సరిపోతుంది. –రవి, సచివాలయ ఉద్యోగి

ప్రభుత్వం పునరాలోచించాలి

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా సొంత మండలాల్లో కాకుండా ఇతర మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన జీఓపై పునరాలోచించాలి. తక్కువ వేతనాలతో నెట్టుకొస్తున్నాం. గెజిటెడ్ అధికారులకు ఉండే నిబంధనలను గ్రామ స్థాయి ఉద్యోగులకు విధించడం మంచిది కాదు. ప్రతి మండలంలో 80 శాతం సొంత మండలానికి చెందిన ఉద్యోగులే విధులు నిర్వహిస్తున్నారు.

–మహ్మద్ గౌస్, వెల్ఫేర్ అసిస్టెంట్‌ల యూనియన్ ప్రతినిధి

ఆలయ భూముల వేలంలో తగ్గిన ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ ఈఓ

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూములకు దేవదాయశాఖ ఈఓ వీరయ్య స్థానిక గ్రామ చావిడిలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. మాన్యం భూములు 70 ఎకరాల మేర ఉన్నా 31.11 ఎకరాలు మాత్రమే సాగుకు అనుకూలంగా ఉంది. మూడేళ్ల క్రితం నిర్వహించిన వేలంలో రూ.76 వేలు రాగా ఈసారి రూ.63 వేలు మాత్రమే పలికింది. భూములను ఏడాదికి మాత్రమే వేలం నిర్వహించడంతో పాటు వేలం పాట పాడిన వెంటనే నగదు చెల్లించాల్సి రావడంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఒకటి, రెండు చోట్ల మాత్రమే భూమి బాగా ఉండగా మిగిలిన భూమి సరిగా లేక పంటల దిగుబడి సరిగా వచ్చేది కాదు. ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతుండడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో చాలా మంది రైతులు వేలానికి దూరంగా ఉన్నారు. 40 ఎకరాలు మేర రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ మైనింగ్ లీజు పరిధిలో ఉండడంతో రైతులు పలు సమస్యలు ప్రస్తావించారు. ఈభూమిలో కొంత భాగం మోతగాళ్లకు జీవన భృతి కోసం కేటాయించామని ఈఓ దృష్టికి తీసుకొచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మైనింగ్ లీజులో ఉన్న భూములను తీసుకుని ఇటిక్యాల సమీపంలో ఉన్న ఫ్యాక్టరీకి చెందిన భూములను ఇస్తారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని ఈఓ చెప్పారు. స్థానికంగా అయితే వేలంలో భూములు దక్కించుకున్న వాళ్లు వ్యవసాయం చేసేందుకు అనుకూలంగా ఉంటుందని ఇతర గ్రామంలో ఇస్తే అక్కడికి వెళ్లి ఎలా పంటలు సాగు చేసుకోవాలని పలువురు రైతులు ప్రశ్నించారు.

యువత పోరును జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


బనగానపల్లెలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గుండం నాగేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: కూటమి నేతలు నిరుద్యోగులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీలిచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత దగా చేస్తున్నందుకు నిరసనగా నిర్వహించ తలపెట్టిన యువత పోరును జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల మండల అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి స్వగృహంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 23వ తేదీ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు కానాల రవీంద్రనాథరెడ్డి, దశరథ రామిరెడ్డి, గుద్దేటి సుధాకరరెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, అక్బర్‌బాషా, జనార్దన్‌రెడ్డి, బాబు, సమీర్, అన్వర్, షరీఫ్, మధు, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేద్దాం

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 23న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పలుకూరు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. 23న కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, పుల్లారెడ్డి, జాన్, ప్రసాద్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు అంబటి రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు సుదర్శన్‌రెడ్డి, మన్మధ, ఆకుల జస్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు

కోవెలకుంట్ల: మారుతున్న కాలానికి అనుగుణంగా రెవెన్యూ సేవలను అప్‌డేట్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంచారని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా భూమి, స్థల సమస్యలు పరిష్కరించడంతో రెవెన్యూ సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. పదవీ విరమణ పొందిన వీఆర్వోలు శంకర్‌రెడ్డి, లక్ష్మినారాయణను సత్కరించారు.

- బేతంచెర్ల: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ నాగమణి అన్నారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధ్రువీకరణ పత్రాల జారీపై అవగాహన కల్పించారు. డీటీ మారుతి, వీఆర్వోలు పాల్గొన్నారు.
- సంజామల: రెవెన్యూ శాఖ అందించే సేవల గురించి ప్రజలకు వివరించాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యలయంలో అర్జీదారులకు స్వీట్స్ పంపిణీ చేశారు. డీటీ తులసి కృష్ణ, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు పునాది వేసేది ఉపాధ్యాయుడే


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేసేది ఉపాధ్యాయులే అని డోన్ డివిజన్ ఉప విద్యాధికారి వెంకటరామిరెడ్డి, మండల విద్యాధికారి రామనర్సప్ప అన్నారు. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీలపై వెళుతున్న వారికి శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు వెంకట సుబ్బారెడ్డి హెచ్ఎంగా హాలహర్వి మండలం విరుపాపురం హైస్కూల్‌కు.. సుబ్బారెడ్డి రాచర్లకు, వెంకటలక్ష్మీ జొన్నగిరికి బదిలీపై వెళ్తున్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లుగా, హెంచ్‌ఎంలుగా బదిలీ అయిన ఉపాధ్యాయులు వెంకటరమణ, మధుసూదనరెడ్డి, అల్లీపీరా, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుభాన్, శివన్న, సురేష్‌లను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. హెచ్‌ఎంలు పద్మావతమ్మ, సురేష్‌బాబు, ఇబ్రహీం, ప్రిన్సిపాల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ

కొలిమిగుండ్ల: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని సీఐ రమేష్ బాబు సూచించారు. శుక్రవారం ఆటో డ్రైవర్లను సమావేశపర్చి పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసన్స్ కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు జూలై 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 17వ తేదీ విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం జూలై 21, 22 తేదీల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతి మార్కులిస్టు, టీసీ, క్యాస్ట్ ఒరిజినల్, ఆధార్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని పేర్కొన్నారు.

నేడు ఆరాధన ఉత్సవాలు

బనగానపల్లె: పట్టణ సమీపంలోని రవ్వలకొండ వద్ద వెలసిన పూదోట లింగావధూతస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు పంచామృతాభిషేకం, సాయంత్రం 6:30 అష్టోత్తర శతదీప సమయుక్త నివేదనలు, రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తాం

- పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం

బేతంచెర్ల: సిమెంట్ నగర్ గ్రామంలోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తామని సంస్థ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 19 రోజులుగా కార్మికులు చేపట్టిన దీక్షలు శుక్రవారంతో ముగిసింది. డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 13 మంది వేజ్‌బోర్డు కార్మికులను 15 రోజుల్లోపు విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 2లక్షలు అడ్వాన్స్, మూడు రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహించి ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

నేడు యోగా డే

డోన్/బనగానపల్లె రూరల్/సంజామల: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం డోన్, బనగానపల్లె, సంజామలలో జరిగే యోగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, బనగానపల్లె, సంజామల ఎంపీడీఓలు వెంకటరమణ, సాల్మన్ అన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. డోన్‌లో గీతాయోగాసన సంఘం గురూజీలు రాంపుల్లయ్య, బచ్చు సురేష్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ, యోగాసన కార్యక్రమం నిర్వహించారు.

డోన్ కోర్టుకు జడ్జిలను కేటాయించాలని వినతి


హైకోర్టు జడ్జికి విన్నవిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

డోన్ టౌన్: డోన్ కోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీ చేయాలని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శీలం భాస్కర్‌నాయుడు, మద్దయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడకు వెళ్లి హైకోర్టు జడ్జీలు శ్రీనివాసరెడ్డి, భానుమతిలను కలిసి వినతి పత్రం అందజేశారు. కొద్ది నెలల క్రితం డోన్ కోర్టుల నుంచి సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్‌అంబేడ్కర్‌లు బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లారని తెలిపారు. మరో జడ్జి ప్రసూతి సెలవులో ఉన్నారన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన ప్రాంతం

డోన్ టౌన్: మండలంలోని గుమ్మకొండ సమీపంలో వెలసిన బంగారుకొండ పాతపాలెం అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం పూజలు కోసం వెళ్లిన కొందరు గుడి సమీపంలో పూజలు చేసి గుంతలు తవ్విన దృశ్యాలను చూసి గ్రామస్తులకు సమచారం ఇచ్చారు. విషయం రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ దశరథరామిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతగా ఉండి సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ ప్రారంభం కాగా ఆయా మండలాల పరిధిలో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, మినుము, కంది, పెసర, ఆముదం, తదితర పంటలకు వర్షం ఊరటనిచ్చింది. సాగు చేసిన పంటలతోపాటు సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుంభాభిషేక మండల వేడుక


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం నిర్మించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గత నెలలో కుంభాభిషేక వేడుకలు జరిగాయి. 40 రోజులు పూర్తి కావడంతో శుక్రవారం మండల పూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులతో అమ్మవారికి పంచామృతాభిషేకం, చండీ, గణపతి, రుద్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం గోపుర కలశానికి కుంభాభిషేక కార్యక్రమం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగరాజు, శివనాగయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కనులపండువగా పల్లకీ సేవ


పల్లకీపై కొలువుదీరిన చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.



బనగానపల్లెలో నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం


అసంపూర్తిగా ఉన్న భవనం

భవనాలు నిరుపయోగం.. సేవలు దూరం

బనగానపల్లె: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సేవలందించేందుక ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. మరికొన్ని నిర్మాణ పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా మిగిలిపోయాయి. బనగానపల్లె పట్టణంలోని రాంభూపాల్‌నగర్‌లో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం–5ను అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గత ఏడాది జనవరి 7న ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారింది. అలాగే పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద నిర్మాణంలో ఉన్న రైతుభరోసా కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అవుకు: ఆత్మహత్యకు యత్నించిన వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. అవుకు తెలుగుపేటకు చెందిన గంగ గురువయ్య భార్య గంగ అంజనమ్మ (29) ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేది. నొప్పి తాళలేక ఈ నెల18వ తేదీ ఇంట్లో ఎవరూలేని సమయంలో సూపర్ వాస్మోలా తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి ముసలబోయిన వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందజేస్తాం

డోన్ టౌన్: విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు, వయో వృద్ధులకు మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్, చంక కర్రలు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు తదితర పరికరాల కోసం జూలై 11వ తేదీ డోన్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఫాతిమా శుక్రవారం తెలిపారు. కావాల్సిన వారు సదరం ధ్రువీకరణ పత్రం (కనీసం 40శాతం), ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, వికలత్వం కనిపించేలా మూడు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి ఉచితంగా పరికరాలు అందజేస్తామన్నారు.